

అభ్యర్థులు కళావెంకటరావు, కలిశెట్టితో చంద్రబాబు



చంద్రన్నను చూసిన ఆనందంలో మహిళల కేరింత



చీపురుపల్లిలో చంద్రబాబు రోడ్‌షోలో పాల్గొన్న జనం

విక్టరీ చిహ్నం చూపుతున్న ఓ వృద్ధురాలు

ఉత్తరాంధ్రను బొత్స ఏం ఉద్ధరించారు?

- సొంతలాభం కోసం ఈ ప్రాంతాన్ని జగన్ మనుషులకు తాకట్టు
- విశాఖను గంజాయి రాజధానిగా మార్చేశారు
- తోటపల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తా.. గరివిడి ఫేకర్ తెరిపిస్తా
- నాగార్జున భవిష్యత్తును నేను చూసుకుంటా
- చీపురుపల్లి రోడ్ షోలో టీడీపీ అధినేత చంద్రబాబు



ఎన్నికల హామీ ప్లకార్డుతో టీడీపీ కార్యకర్త

చీపురుపల్లి, మే 9

సొంత లాభం కోసం ఈ ప్రాంతాన్ని విజయసాయిరెడ్డి, ఎస్వీ సుబ్బారెడ్డిలకు తాకట్టు పెట్టడం తప్ప, ఉత్తరాంధ్ర జిల్లాలకు వైసీపీ నాయకుడు బొత్స సత్యన్నారాయణ ఏం ఉద్ధరించారని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ తుడుచుకుపోవడం, చీపురుపల్లిలో బొత్స సత్యనారాయణ చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. చీపురుపల్లిలోని మెయిన్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్ షోలో ఆయన ఉత్సాహంగా ప్రసంగించారు. ఐదేళ్ల వైసీపీ పాలన ప్రజా వ్యతిరేకంగా సాగిందన్నారు. ఉత్తరాంధ్రని వైసీపీ నేతలు దోచుకుతింటుంటే.. బొత్స సత్యనారాయణ నోరు మెదపకుండా సాయిరెడ్డికి ఊడిగం చేశారని విమర్శించారు. జిల్లాను బొత్స కుటుంబం దోచుకుంటోందని, బొత్స అప్పలనర్సయ్య గజపతినగరం ఎమ్మెల్యేగా, మజ్జి శ్రీనివాసరావు జడ్పీ చైర్మన్‌గా, బడ్డుకొండ అప్పలనాయుడు నెల్లిమర్ల ఎమ్మెల్యేగా, బొత్స సత్యనారాయణ చీపురుపల్లి ఎమ్మెల్యేగా అందరూ కలిసి హోల్‌సేల్‌గా జిల్లాను దోచుకుంటున్నారన్నారు. ఇప్పుడు బొత్స సత్యనారాయణ సతీమణి ఝాన్సీకి విశాఖ ఎంపీ సీటు కేటాయించారని, విజయనగరం దోచుకున్నది చాలక విశాఖపై పడ్డారన్నారు. బీసీల ప్రాబల్యం వున్న ఈ ఉత్తరాంధ్రపై సాయిరెడ్డి పెత్తనం ఏమిటని చంద్రబాబు ప్రశ్నించారు. తోటపల్లి ప్రాజెక్టుకు పునాది వేసింది తానేనని, 2014 నుంచి 2019 టీడీపీ హయాంలో తోటపల్లి అభివృద్ధికి రూ.700 కోట్లు కేటాయించానన్నారు. జగన్ హయాంలో తోటపల్లి ప్రాజెక్టు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, తిరిగి ఎన్‌డీఏ కూటమి అధికారం చేపట్టగానే తోటపల్లి ద్వారా చివరి ఎకరా వరకూ నీరు వచ్చేలా నిధులు కేటాయించి ప్రాజెక్టును పూర్తిచేస్తానన్నారు. గరివిడి ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ ఎంతో మందికి ఉపాధిని కల్పించిందని, కూటమి అధికారంలోకి రాగానే తెరిపించేందుకు యాజమాన్యంతో మాట్లాడుతానన్నారు. అదే విధంగా చీపురుపల్లిలో కొత్త పరిశ్రమను ఏర్పాటు చేస్తానన్నారు.

సంపద సృష్టించి.. మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తానని చెప్పారు. బాదుడు లేని సంక్షేమాన్ని ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తానన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ హామీలను ప్రకటించడమే కాకుండా వాటిని ఖచ్చితంగా అమలు చేస్తానన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.. ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు, అదే విధంగా నెలకు రూ.1,500 చొప్పున మహిళలకు ఆర్థిక సాయం, తల్లికి వందనం పేరిట చదువుకున్న పిల్లలకు రూ.15 వేలు ఆర్థిక సాయం వంటివి అమలు చేసి పేదరిక నిర్మూలన దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపై తొలి సంతకం, ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై రెండో సంతకం చేస్తానని చంద్రబాబు ప్రకటించారు.

- టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేదీ లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. చీపురుపల్లి జనసేన నాయకుడు వాహనం అద్దాలు పగులగొట్టిన విషయాన్ని ఆ నాయకుడు చంద్రబాబు దృష్టికి తీసుకురాగానే ఆయన స్పందించారు. నాగార్జున భవిష్యత్తును తాను చూసుకుంటానని చంద్రబాబు పునరుద్ఘాటించారు. పొత్తు ధర్మంలో భాగంగా ఎచ్చెర్ల సీటును బీజేపీకి కేటాయించామని, ఈ నేపథ్యంలోనే సీనియర్ నాయకుడు, అనుభజ్ఞుడైన కళా వెంకటరావుకు చీపురుపల్లి నియోజకవర్గాన్ని కేటాయించాల్సి వచ్చిందని చంద్రబాబు వివరించారు. భవిష్యత్తులో నాగార్జునకు మంచి అవకాశాలు కల్పిస్తామన్నారు. చంద్రబాబు వెంట ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు, పార్టీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, కేఏ నాయుడు, గద్దే అనురాగ్, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు తదితరులున్నారు.



ఆకాశం మేఘావృతమైనా షాపింగ్ కాంప్లెక్స్ డాబా పైనుంచి కదలకుండా చంద్రబాబు ప్రసంగం వింటున్న జనం

వైసీపీలో పోస్టల్ కలవరం

- వ్యూహం బెడిసికొట్టిందేమోనని టెన్షన్
- ఉద్యోగుల నుంచి ప్రతికూల పవనాలేనా?



(కలెక్టరేట్)

పోస్టల్ బ్యాలెట్ పోల్ అయిన తీరు అధికార పార్టీ నేతలను కలవర పెడుతోంది. మొదటి రోజు నుంచి చివరి రోజు అయిన గురువారం వరకు ఆ పార్టీ నేతలు పోస్టల్ బ్యాలెట్లను తమ ఖాతాలో వేసుకునేందుకు అనేక కుయుక్తులు పన్నారు. ఉద్యోగుల ఓట్లలో వీలైనన్ని వైసీపీకి పడేలా ప్రలోభాలకు ప్రయత్నించారు. ఓటేయడానికి బయలుదేరిన ఉద్యోగిని అనుసరిస్తూ పదేపదే ఫ్యాన్ గుర్తును చూపుతూ ఇబ్బంది పెట్టారు. అడగకపోయినా మజ్జిగ, పెరుగు ప్యాకెట్లు పంచారు. సీక్రెట్‌గా డబ్బులు ఇవ్వజూపారు. మందు సీసాలను కూడా వెంట పెట్టుకుని ఫెసిలిటేషన్ సెంటర్ సమీపంలో ఆటోలో తిష్ఠ వేశారు. ఈ విధంగా అనేక రకాలుగా ఉద్యోగులను దారి తప్పించడానికి ప్రయత్నించినా వారు మాత్రం తామనుకున్న మార్గాన్ని వీడలేదు. ఓటేసి వచ్చాక వారు స్పందించిన తీరే అందుకు నిదర్శనం. కొందరు ఉద్యోగులు ముందే వైసీపీ వారు ఏం చెప్పినా తల ఊపేయాలని, ఓటు మాత్రం అనుకున్న వ్యక్తికే వేయాలని నిర్ణయించుకున్నారు. అటువంటి వారు ఏ మిచ్చినా దర్జాగా తీసుకున్నారు. వైసీపీ శ్రేణులు మాత్రం ఉద్యోగులు తమవైపే ఉన్నారని చంకలు గుద్దుకుంటున్నారు.

ప్రజాప్రతినిధులు సైతం క్యూ..

ఫెసిలిటేషన్ కేంద్రాలకు ఏకంగా వైసీపీ ప్రజాప్రతినిధులు క్యూ కట్టిన పరిస్థితి ఈ మూడు రోజుల్లో కనిపించింది. ఎంపీపీలు, జడ్పీటీసీలు ఏజెంట్ల రూపంలో అక్కడే తిష్ఠవేయగా మిగతా వారు ఓటర్లను పలకరించడం, దగ్గరగా వెళ్లి ఓటు అభ్యర్థించడం.. సహకరించాలని కోరడం.. ఏమైనా కావాలా అని అడగడం చేశారు. నాయకులు ఉద్యోగుల జాబితాను పట్టుకుని తిరగడం కూడా కనిపించింది. శృంగవరపుకోట ఫెసిలిటేషన్ సెంటర్ తొలిరోజు కోలాహలంగా మారిపోయింది. ఏకంగా ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే అధికార పార్టీ ఎంపీపీ, జడ్పీటీసీలు తిష్ఠవేసేశారు. పోలింగ్ బూత్ ఎదురుగా వున్న విశాఖ-అరకు రోడ్డులో కూడా ఎక్కడ చూసిన వైసీపీ నాయకులు, కార్యకర్తలే కనిపించారు. ఇక విజయనగరంలోని జేఎన్‌టీయూ సమీపంలో అధికార పార్టీ ఎన్నికల ప్రచారమే చేసేసింది. ఫ్యాన్ గుర్తును చూపి వాటర్, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తూ ప్రలోభాలకు ప్రయత్నించింది.

ఆ నేతల్లో కలవరం

పోస్టల్ బ్యాలెట్ నమోదైన శాతాన్ని చూసి అధికార పార్టీ నేతలకు ఇప్పటి నుంచే దిమ్మ తిరుగుతోంది. దాదాపు ఉద్యోగులంతా ఓటును ఉపయోగించుకున్నారు. స్థానికంగా లేకపోయినా జిల్లా కేంద్రంలో ఉన్న ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రానికి వెళ్లి ఓటేశారు. వారంతా ముందు నుంచే ఖచ్చితమైన అభిప్రాయంగా ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు ఉద్యోగులైతే పిల్లలతో క్యూలో నిరీక్షించారు. తద్వారా ఓటు ప్రాధాన్యాన్ని కూడా చెప్పకనే చెప్పారు. చివరి రోజు చాలా మంది ఉద్యోగులు నాయకులు పిలిచినా వారి వద్దకు వెళ్లలేదు. చిన్నగా నవ్వేసి ఓటు వేసి వెళ్లిపోయారు. మరి ఆ మౌనం దేనికి సంకేతమో చూడాలి.

ఇబ్బడి ముబ్బడిగా ఖర్చు

పోస్టల్ బ్యాలెట్లకు గాలం వేసే పనిలో భాగంగా అధికార పార్టీ నేతలు ఖర్చుకు ఏమాత్రం వెనుకాడలేదు. కొందరు ఉద్యోగులను ఒత్తిడి చేసి మరి ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రం వద్ద దించారు. ఆయా నాయకులు పరిచయం ఉన్న వ్యక్తులు కావడంతో ఉద్యోగులు మొహమాటంతో వాహనం ఎక్కారు. కాగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి వచ్చాక వారిని నాయకులు పట్టించుకోలేదు. ఈ విషయాన్ని ఉద్యోగులు ముందే పసిగట్టారు. తాము అనుకున్నట్లు ఓటేసి వెళ్లారు.



16,102 పోస్టల్ బ్యాలెట్లు

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఈనెల 5వ తేదీ నుంచి ఇప్పటి వరకూ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వేశారు. ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకూ 16,102 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వేశారు. రాజాంలో 2116 మంది, బొబ్బిలిలో 2433, చీపురుపల్లిలో 1496, గజపతినగరంలో 2089, నెల్లిమర్లలో 1759,విజయనగరంలో 4204, ఎస్.కోటలో 2005 మంది పోస్టల్ బ్యాలెట్ వేశారు.

ఈ మూడు రోజులూ కీలకం

- 48 గంటల ముందు నుంచి డ్రై డే
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

కలెక్టరేట్, మే 9: ఎంసీసీ నిఘా బృందాలు ప్రధానంగా వాహనాల తనిఖీల్లో నగదు, మద్యం, వస్తువుల రవాణాపై దృష్టి పెట్టాలని, రానున్న మూడు రోజుల్లో మరింత చురుగ్గా పనిచేయాలని జిల్లా ఎన్నికల ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. వెబినార్‌లో ఆమె గురువారం మాట్లాడుతూ పలు సూచనలు ఇచ్చారు. ఉత్సవాలు, వేడుకలు, సమావేశాల్లో చేస్తున్న ఖర్చులను, బహుమతుల పంపిణీలపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. అభ్యర్థుల ప్రచారం 11వ తేదీ సాయంత్రం 5 గంటలతో ముగుస్తుందని, 12వ తేదీ డోర్‌టు డోర్ ప్రచారాన్ని అనుమతించడం జరుగుతుందని, అయితే పరిమిత సంఖ్యలోనే అనుమతించాలని చెప్పారు. వాహనాలన్నింటికీ 11వ తేదీతో అనుమతులు ఆపేయాలని, 12,13 తేదీల్లో అభ్యర్థుల వాహనాలకు ఆర్వోలు పాస్‌లు జారీ చేస్తారని తెలిపారు. ఎన్నికలకు 48 గంటల ముందు నుంచి (11వ తేదీ నుంచి 13వ తేదీ సాయంత్రం వరకూ) మద్యం దుకాణాలు బంద్ చేయాలని తెలిపారు. అన్ని వాహనాలనూ చెక్ పోస్టుల వద్ద తనిఖీ చేయాలని, నిఘా బృందాలకు మెజిస్టీరియల్ పవర్స్ ఉన్నాయని, అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు.



ప్రింట్ మీడియాలో 12,13 తేదీల్లో ప్రకటనల కోసం ఎంసీఎంసీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. 11వ తేదీ సాయంత్రం 6 గంట నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమావేశంలో ఎంసీసీ నోడల్ అధికారి అరుణ శ్రీ, ఎన్నికల వ్యయ నిఘా బృందం నోడల్ అధికారి సత్య ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

ఇరువర్గాలపై పోలీస్ కేసు

బొండపల్లి, మే 9: తెలుగుదేశం పార్టీ కార్యకర్త గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ అందరితో కలివిడిగా ఉండడం చూసి తట్టుకోలేకపోయిన వైసీపీ నాయకులు అతన్ని ప్రత్యేకంగా పిలిపించి దాడి చేసిన ఘటన బొండపల్లి మండలం గొట్లాం పంచాయతీ శివారు గ్రామం జియ్యమ్మవలసలో చోటుచేసుకుంది. రెండు రోజుల కిందట జరిగిన ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. బాధితుడు పట్నాల గౌరునాయుడు, ఏఎస్ఐ ఎల్.గోపీనాథ్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలసకు చెందిన గౌరునాయుడు ఈ నెల 7వ తేదీన తెలుగుదేశం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నాడు. ఇది గమనించి కక్షగట్టిన గ్రామ పెద్ద మీసాల తులసీ రావు స్థానికంగా ఉన్న ధాన్యం మిల్లులో జియ్యమ్మవలస గ్రామస్థులతో పంచాయితీ నిర్వహించారు. గౌరునాయుడు టీడీపీ ఇంటింటి ప్రచారానికి వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. దీనిని గౌరునాయుడు మద్దతుదారులు వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. సహకార సంస్థ చైర్మన్ మహంతి రమణ, తులసీరావు కలిసి బాధితుడు పట్నాల గౌరునాయుడుపై దాడి చేశారు. ఘటనపై బాధితుడితో పాటు అవతలి వర్గం వారు కూడా గురువారం ఫిర్యాదు చేశారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి

పీపుల్స్ మేనిఫెస్టో

సహకార రంగాన్ని బలోపేతం చేయాలి



సాలూరు రూరల్: సహకార రంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామీణ పరపతి విధానంలో ప్రాథమిక సహకార సంఘాలది ప్రధాన పాత్ర. వీటిని బలోపేతం చేస్తే గ్రామస్థాయిలో రైతులకు మేలు జరుగుతుంది. సేద్యానికి పెట్టుబడికి రైతులకు ఇబ్బంది లేకుండా పోతుంది. ఇప్పటి విధానంలో లోపాలను గుర్తించి బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి. అప్పుడే రైతులకు మేలు జరుగుతుంది. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- పెద్దింటి మాధవరావు, మామిడిపల్లి


ఒట్టుపెట్టి ఓటేస్తే.. ఖర్చులు చెల్లిస్తాం!



విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు వైసీపీ నాయకులు రకరకాల ట్రిక్స్ ఉపయోగిస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. సర్వేలన్నీ కూటమికి అనుకూలంగా ఉండటంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలిచేందుకు మద్యం, డబ్బులు విచ్చలవిడిగా పంచే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా వలస వెళ్లిన ప్రతి కుటుంబాన్నీ జిల్లాకు రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. హైదారాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖ వంటి నగరాల్లో పనిచేసే వారిని ఓట్లు వేసేందుకు పిలుస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా వారికి ప్రయాణ ఖర్చులంటూ ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపిస్తున్నారు. ఓటు వేసిన వారు ప్రమాణం చేస్తే రానూ పోను టిక్కెట్లే కాకుండా.. ఆ రోజు ఇతరత్రా ఖర్చులు కూడా తామే ఇచ్చుకుంటామని చెప్పుకొస్తున్నారు. కొంతమంది ప్రలోభాలకు లొంగడం లేదు. 'మీ డబ్బులు, మీ టిక్కెట్లు వద్దు.. ప్రజాస్వామ్యబద్ధంగా మా ఓటును వినియోగించుకుంటా'మని వైసీపీ నేతలకు చెప్పడంతో కంగుతింటున్నారు. మరోవైపు స్థానికంగా ఓటర్లకు మద్యం, డబ్బు పంపిణీకి కూడా తెర తీశారు.

ఓటర్లకు ఎర వేసేవారు కాదు

పెద్దల మాట



సాలూరు రూరల్: గతంలో ఎన్నికల్లో విజయం కోసం ఓటర్లకు ఎర వేసేవారు కాదు. పార్టీలు మాత్రం అభివృద్ధి చేస్తాం... జీవన ప్రమాణ స్థాయి పెంచుతామని... పేదరికం నిర్మూలిస్తామని నినాదాలు చేసేవి. విజయం కోసం ఆయాచితంగా అవి ఇస్తాం, ఇవి ఇస్తామని అనేవి కాదు. సాలూరు రెండో ఎమ్మెల్యే అల్లు ఎరుకునాయుడు అసెంబ్లీకి వెళ్లడానికి అప్పు చేసి వెళ్లిన రోజులు ఉన్నాయి. ఎమ్మెల్యేల జీతాలు తక్కువే. పోటీ చేసిన అభ్యర్థి వ్యక్తిత్వం, గుణగణాలను పరిగణనలోకి తీసుకొని ఓటు వేసేవారం. ఇప్పుడు ఎమ్మెల్యేల జీతాలు రూ.లక్షల్లో ఉన్నాయి. సమర్థులను గుర్తించి ఓటు వేస్తాను.

- బలబద్రుని కృష్ణారావు (86), సాలూరు

కొత్తవారిని కలిపేద్దాం

- పార్టీల్లో చేరికలకు అభ్యర్థుల వ్యూహాలు

(విజయనగరం)

ఎన్నికలు అనగానే కూడికలు..తీసివేతలు సహజం. అదేనండీ... అప్పటి వరకూ ఓ పార్టీలో ఉన్న వారు ప్రత్యర్థి పార్టీలో చేరితే... ప్రత్యర్థి పార్టీ వారు ఎదుటి పార్టీలో చేరడం సాధారణం. దీని వల్ల రెండు లాభాలు. ఒకటి తమ పార్టీ విధానాలు నచ్చి..చేరికలు పెరుగుతున్నాయని సంబంధిత అభ్యర్థులు చెప్పుకోవడానికి ఓ అవకాశం ఉంటుంది. రెండోది ఎదుటి పార్టీపై మానసికంగా పైచేయి సాధించినట్టు అవుతుంది. ఇక మూడోది జనం తమ పార్టీ వైపు ఆకర్షితులయ్యేలా చేసుకోవచ్చు. ప్రజల్లో కొంచెం పట్టున్న వ్యక్తులు పార్టీలో చేరితే ఆ ప్రభావం కూడా కలసి వస్తుంది. దీంతో ప్రధాన పార్టీలు ఎదుటి వారిని తమవైపు ఆకర్షించడానికి...ఎక్కువ మందిని పార్టీలో చేర్చుకోవడానికి ప్రాధాన్యమిస్తాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఓవైపు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూనే మరోవైపు చేరికలపై దృష్టి సారిస్తున్నారు. దీనికోసం అభ్యర్థులు కొంతమందికి ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. పల్లెలు... పట్టణాలు.. మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, కీలక ద్వితీయ శ్రేణి నాయకులు ప్రధాన పార్టీల్లో చేరుతున్నారు. ప్రజల్లో వారికి ఉన్న ఆదరణ తమకు ఓట్ల రూపంలో లబ్ధి చేకూరుస్తుందని అంచనా వేసుకుంటున్నారు. ప్రత్యర్థి పార్టీల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకుల వివరాలను ఆరా తీస్తూ పార్టీలోకి వచ్చేలా చేస్తున్నారు. పార్టీలోకి వస్తామనే నేతల ఓటు బలం ఎంత? సామాజిక వర్గంలో వారికున్న బలం ఏంటి అనే అంశాల ఆధారంగా అభ్యర్థులు వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నారు. ఎన్నికల్లో గెలిస్తే పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని... అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇస్తున్నారు. అయితే కొన్ని చోట్ల ఈ చేరికలపై సొంత పార్టీ నాయకుల నుంచి వ్యతిరేకతలు వ్యక్తమవుతున్నాయి. కొత్త వారు చేరితే తమ ప్రాధాన్యం తగ్గుతుందనే ఆలోచనతో...అప్పటి వరకూ ఆ పార్టీలో ఉన్న వారు ఇతర పార్టీల వారి రాకను వ్యతిరేకిస్తున్నారు.




ఎవరి సర్వే వారిదే!



- సొంతంగా వివరాలు తెలుసుకుంటున్న అభ్యర్థులు
- నివేదికల ఆధారంగా వ్యూహాలు
- బెట్టింగ్‌ల కోసం కొన్ని సంస్థల సర్వేలు

(గరుగుబిల్లి)

'మన నియోజకవర్గంలో నా పరిస్థితేంటి? ఏ వర్గం ప్రజల్లోనైనా నా పట్ల వ్యతిరేకత ఉందా? ఎవరైనా నాకు వ్యతిరేకంగా పని చేస్తున్నారా? ఎవరెవరిని బుజ్జగించాలి? నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ఓటర్లను ఎక్కువగా ప్రభావితం చేసే వ్యక్తులెవరు? ప్రచారాన్ని ఏ విధంగా నిర్వహించాలి?'... అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులంతా ఇప్పుడు ఈ అంశాలను తెలుసుకునే పనిలో పడ్డారు. ఇందుకోసం సొంతంగా సర్వేలు చేయించుకుంటున్నారు. అధిష్ఠానాలు పార్టీల తరఫున సర్వేలు చేయిస్తున్నా... అభ్యర్థులు కేవలం వాటిపైనే ఆధారపడటం లేదు. పార్టీ అధిష్ఠానాల సర్వేలు గెలుపోటములు, మరికొన్ని అంశాలకే పరిమితమవుతున్నాయి. దీంతో అన్ని అంశాలను తెలుసుకునేందుకు అభ్యర్థులు వ్యక్తిగతంగా సర్వే చేయించుకుంటూ ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు. కచ్చితంగా గెలవాలనుకునే నేతలంతా ఇలా రెండో అభిప్రాయం కోసం సర్వే సంస్థలను ఆశ్రయిస్తున్నట్లు ఏజెన్సీ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్‌కు చెందిన అభ్యర్థులు ఇలా సొంతంగా సర్వే చేయించుకునేందుకు పొరుగు రాష్ట్రంలోని ఓ ప్రధాన సర్వే సంస్థను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.



పార్టీలకు అదే ఆధారం

వాస్తవానికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ ప్రజానాడిని పట్టేందుకు సర్వేలనే నమ్ముకుంటున్నాయి. క్షేత్ర స్థాయిలో బలాలు, బలహీనతలేంటో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ముఖ్యంగా అధికార వైసీపీ అయితే ఇంటెలిజెన్స్ వర్గాలతో పాటు వివిధ సంస్థలతో ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటోంది. టీడీపీ, కాంగ్రెస్‌లు కూడా తమ వ్యూహకర్తల పైనే ఎక్కువగా ఆధార పడుతున్నాయి. వారు ఇచ్చిన సర్వేల ఆధారంగానే హైకమాండ్ అభ్యర్థులను ఎంపిక చేసింది. గతంలో ఎప్పుడూ రాజకీయ పార్టీలు ఇంతలా సర్వేలపై ఆధారపడలేదు. పోటీ చేయాలనుకున్న కొందరు నేతలు మాత్రమే సర్వే చేయించుకునేవారు. ఎన్నికల్లో పోటీ అంటే కోట్ల రూపాయల ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ముందుగా ఐదారు లక్షల రూపాయలతో సర్వే చేయించుకుని... తనకు గెలుపు అవకాశాలున్నాయంటేనే బరిలోకి దిగేవారు. కానీ ఈ సారి పార్టీలే సర్వేలు చేయిస్తున్నాయి.

అంతు చిక్కని ప్రజానాడి

ఈసారి సర్వేల్లో కూడా పూర్తి ఖచ్చితత్వంతో కూడిన అభిప్రాయాలు వెల్లడి కావడం లేదని ఆయా సంస్థలే చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రజానాడిని పట్టుకోలేకపోతున్నామని ఓ సర్వే సంస్థ ప్రతినిధి వెల్లడించాడు. ఓటర్లు మనసులో ఒక నిర్ణయంతో ఉండి.. పైకి మాత్రం మరోలా చెబుతున్నారని అంటున్నారు. అంతేకాకుండా తమ అభిప్రాయాన్ని స్పష్టంగా బయటపెడితే తమ ఉనికి ఎక్కడ బయటపడుతుందో, దానివల్ల మున్ముందు ఏ సమస్య వస్తుందోనన్న భయంతో కూడా సరైన సమాచారం ఇవ్వడం లేదంటున్నారు. ఓటర్లు చెప్పే దానికి... ఓటు వేసేవాడికి మధ్య కనీసం 2.5 శాతం తేడా ఉండే అవకాశాలు ఉన్నాయని సర్వే సంస్థలు చెబుతున్నాయి.

బెట్టింగుల కోసం..

ఏపీ ఎన్నికలపై బెట్టింగులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో రెండోసారి వైసీపీ అధికారంలోకి వస్తుందా? లేక టీడీపీ అధికారంలోకి వస్తుందా? అన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దీనిపై ఇప్పటికే పందెంరాయుళ్లు రంగంలోకి దిగి గెలిచే పార్టీ ఏదో తెలుసుకు నేందుకు సర్వే సంస్థల యజమానులను కలుస్తున్నట్లు సమాచారం. ఏజెన్సీలు ఇచ్చే నివేదికను బట్టి కోట్ల రూపాయల బెట్టింగులు జరగబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు తెలంగాణకు చెందిన కొందరు బెట్టింగ్ రాయుళ్లు కూడా సర్వే సంస్థలను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

నెల రోజుల్లో తోటపల్లి నీరు

- పోలవరంతో పాటు సుజల స్రవంతి పనులు ప్రారంభిస్తాం
- అందరి ఆమోదంతో చీపురుపల్లికి మున్సిపాలిటీ హోదా
- ఆర్ఈసీఎస్ సేవలు ప్రారంభిస్తాం
- చీపురుపల్లి కూటమి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు

(చీపురుపల్లి)

'చీపురుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయి. ప్రభుత్వపరంగా వచ్చే పథకాల తో పాటు ఇక్కడి ప్రజల కోసం ప్రత్యేకంగా ఆలోచిస్తా ను. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వల్ల తోటపల్లి పనులు పూర్తి కాక, ఆయకట్టు పరిధిలోని రైతులు సుమారు రెండు వేల కోట్ల పంటను నష్టపోయారు. వారందరికీ న్యాయం చేయాలి. వెనుకబడిన ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి. వీటన్నింటి పైనా దృష్టి పెడతాను.' అని చీపురుపల్లి ఉమ్మడి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు అన్నారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే...



చీపురుపల్లి నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు

సుజల స్రవంతి పనులు ప్రారంభిస్తాం

ఉత్తరాంధ్రకు సాగు, తాగు నీరందించే సుజల స్రవంతిని పూర్తి చేయడం చంద్రబాబు లక్ష్యం. రెండు వేల కోట్లతో ఈ పనులకు అప్పట్లో చంద్రబాబునాయుడు నర్సీపట్నం వద్ద శంకుస్థాపన చేశారు. ఆయన గెలిచి ముఖ్యమంత్రి అయిన వెంటనే పోలవరం పనులు జోరందుకుంటాయి. ఆ పనులతో పాటే సుజల స్రవంతి కూడా ప్రారంభించేలా ముఖ్యమంత్రితో మాట్లాడి ఒప్పిస్తాను.

నెల రోజుల్లో తోటపల్లి పనులు పూర్తి

తోటపల్లి కాలువల్లో పూడిక తీత పనులు పెండింగ్ లో ఉన్నాయి. గత పాలకులు వీటిని పట్టించుకోలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేస్తాం. పెండింగ్‌లో ఉన్న పిల్ల కాలువ పనులన్నీ పూర్తి చేసి పూర్తి ఆయకట్టుకు నెల రోజుల్లో సాగు నీరందించే విధంగా కృషి చేస్తాను.

కొత్త పరిశ్రమల ఏర్పాటుకు కృషి

రాష్ట్రంలోని నిరుద్యోగ యువత కోసం ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామని మా మేనిఫెస్టోలో ప్రకటించాం. ఖాళీ అయిన ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఇవి కాకుండా సాంకేతికతపై మా అధినేతకు విజన్, శ్రద్ధ ఉన్నాయి. వీటిని అందిపుచ్చుకొని చీపురుపల్లి నియోజకవర్గంలోని యువత కోసం స్థానికంగా పరిశ్రమల ఏర్పాటుకు నా వంతు కృషి చేస్తాను. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులపై దృష్టి పెడతాను. చీపురుపల్లిలో అర్ధంతరంగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం వంటి అసంపూర్తి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తాను.

ఆర్ఈసీఎస్ పునరుద్ధరణ

చీపురుపల్లి ఆర్ఈసీఎస్ సంస్థ బాగా పని చేస్తోంది. ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన చీపురుపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘం లిమిటెడ్‌ను మేం అధికారంలోకి రాగానే తిరిగి ప్రారంభిస్తాం. ఇక్కడి రైతులకు ఆ సంస్థ సేవలు కొనసాగేలా అన్ని చర్యలు తీసుకుంటాను. రెవెన్యూ డివిజన్‌గా ఉన్న చీపురుపల్లికి అన్ని శాఖల కార్యాలయాలు మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తాను. మా నాయకుడు చంద్రబాబుతో మాట్లాడి, రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రంలో ఏయే కార్యాలయాలు ఉండాలో అన్నీ ఏర్పాటు చేయిస్తాను. అన్ని కార్యాలయాలకు పక్కా భవనాలు కూడా మంజూరు చేయడానికి కృషి చేస్తాను.

అందరి ఆమోదంతోనే..

లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు, పట్టణ పెద్దలు, ఇతర అన్ని వర్గాలతో చర్చించి, మెజారిటీ వర్గాల ఆమోదం మేరకు పట్టణానికి మున్సిపాలిటీ హోదాపై నిర్ణయం తీసుకుంటాను. అప్‌గ్రేడేషన్‌కు అందరూ అంగీకరిస్తారని నేను అనుకోవడం లేదు. అప్‌గ్రేడైతే ప్రజలపై పన్నుల భారం పడుతుందనేది ఒక అభిప్రాయం ఉంది. పక్కనే ఉన్న రాజాంలో కూడా మున్సిపాలిటీ హోదాపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ విషయంలో అందరి ఆమోదంతోనే నిర్ణయం తీసుకుంటాను.

ఊరూ.. వాడా.. కూటమి అభ్యర్థులే

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ఊరూ.. వాడా తిరుగుతూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పల్లెలు, పట్టణాల్లో సుడిగాలి పర్యటనలు చేపడుతున్నారు. గురువారం వివిధ నియోజకవర్గాల అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరి ప్రచారానికి జనం నుంచి మంచి స్పందన లభిస్తోంది.



పాలకొండ: మాట్లాడుతున్న హైపర్ ఆది, పక్కన జనసేన అభ్యర్థి జయకృష్ణ



నెల్లిమర్ల: ప్రచారంలో విజయనగరం కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు



పార్వతీపురం రూరల్: కూటమి అభ్యర్థి విజయచంద్రకు హారతి ఇస్తున్న మహిళలు



గుర్ల: చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు ప్రచారం



విజయనగరంలో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు



నెల్లిమర్ల: సారిపల్లి రోడ్‌షోలో మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాగమాధవి



మెంటాడ: సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణికి మహిళల హారతులు



వంగర: ప్రచారంలో మాట్లాడుతున్న కొండ్రు మురళి



బొబ్బిలి: పక్కిలో ప్రచారం చేస్తున్న బేబీనాయన

జన కేతనం
ఆంధ్రజ్యోతి
శుక్రవారం 10 మే 2024



కురుపాంలో చంద్రబాబు చేపట్టిన రోడ్ షోలో పాల్గొన్న ప్రజలు

టీడీపీలో నూతనోత్తేజం



కురుపాం: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతిని దహనం చేస్తున్న చంద్రబాబు



- **కురుపాం సభకు భారీగా జనం**
- **ఉత్సాహంగా బాబు ప్రసంగం**

గురుగుబిల్లి/కురుపాం: టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల సభకు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 20 వేలకు పైగా ప్రజలు హాజరయ్యారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలతో కురుపాం కిటకిటలాడింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయం 11.30 గంటలకు బహిరంగ సభ జరగాల్సి ఉంది. కానీ మధ్యాహ్నం 1.50 గంటలకు సభా ప్రాంగణానికి చంద్రబాబు చేరుకున్నారు. సుమారు గంట సమయం పాటు ఉపన్యసించారు. ఎండను సైతం లెక్క చేయకుండా మూడు పార్టీల శ్రేణులు, కార్యకర్తలు తరలివచ్చారు. రహదారులన్నీ మూడు రంగుల జెండాలతో రెపరెపలాడాయి. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చారు. ప్రజాగళం సూపర్ సక్సెస్‌కు కారణమైన యువనేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్‌ను టీడీపీ అధినేత అభినందించారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత తీసుకోవాలని అరకు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణకు చంద్రబాబు సూచించారు.



గరుగుబిల్లి మండలం సంతోషపురానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వస్తున్న దృశ్యం



కురుపాం బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆకట్టుకున్న ఫ్లెక్సీ

కురుపాం బస్టాండ్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఎంతగానో ఆకట్టుకుంది. ఏపీకి డ్రైవర్ బాబు అనే పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని అంతా ఆసక్తిగా తిలకించారు. బహిరంగ సభలో మాట్లాడుతున్న సమయంలో చంద్రబాబు ఆ ఫ్లెక్సీని చూసి రాష్ట్ర ప్రజలను సురక్షిత స్థానంలో ఉంచేందుకు ఏపీకీ డ్రైవర్‌ను తానేనని చిరునవ్వుతో అన్నారు.



చీపురుపల్లి మెయిన్ రోడ్డులో..

చంద్రబాబు పర్యటన ఇలా..

కొమరాడ, మే 9: తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కురుపాంలో పర్యటించారు. స్థానిక బస్టాండ్ జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు.

- మధ్యాహ్నం 1.28 గంటలకు కురుపాం సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న హెలీపాడ్ వద్దకు చేరుకున్నారు.
- కురుపాం, పార్వతీపురం కూటమి అభ్యర్థులు తోయక జగదీశ్వరి, విజయచంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, దత్తి లక్ష్మణరావులు చంద్రబాబుకు స్వాగతం పలికారు.
- 1.35 గంటలకు హెలీపాడ్ నుంచి బహిరంగ సభా స్థలానికి బయలుదేరారు. ప్రజలకు అభివాదం చేస్తూ సాగారు.
- 2.50 గంటల వరకు సభలో ప్రసంగించారు.
- 2.55 గంటలకు హెలీపాడ్ వద్దకు బయలుదేరారు.
- 3.05 గంటలకు హెలీపాడ్‌కు చేరుకున్నారు.
- 3.15 గంలకు బస్సులో భోజనం చేశారు.
- 3.40 గంటలకు టీడీపీలో చేరిన పార్వతీపురం వైసీపీ నాయకులకు కండువాలు వేశారు.
- 4 గంటలకు కురుపాం నుంచి హెలీకాప్టర్‌లో చీపురుపల్లి బయలుదేరారు.
- భారీ జన సందోహంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కురుపాం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి, పక్కన అరకు కూటమి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత



టీడీపీ అధినేతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పార్వతీపురం కూటమి అభ్యర్థి విజయచంద్ర

నృత్యాలతో సందడి

గుమ్మలక్ష్మీపురం: చంద్రబాబు రాక కోసం కురుపాంలో ప్రజలు, కూటమి శ్రేణులు ఓపిగ్గా ఎదురుచూశారు.

- టీడీపీ పాటలకు గిరిజన మహిళలు, యువత నాన్‌స్టాప్‌గా నృత్యాలు చేశారు.
- చంద్రబాబు తన ఉపన్యాసంలో పవన్‌కల్యాణ్ పేరు ప్రస్తావించినప్పుడల్లా యువత నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది.
- చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో 108 వాహనం రావడంతో ఆయన స్పీచ్‌ను మధ్యలో ఆపేశారు. అంబులెన్స్‌కు దారి ఇమ్మని పోలీసులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు.
- ఆ సమావేశం సమయంలో మూడుసార్లు అటువైపుగా 108 వాహనం తిరగడం సందేహాలకు తావిచ్చింది.



చీపురుపల్లి పట్టణంలో..



చీపురుపల్లిలో ప్లకార్డుతో దివ్యాంగుడు

టీడీపీలో చేరిన జయబాబు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి, మే 9: పార్వతీపురం నియోజకవర్గంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, వైసీపీ నాయకుడు బెలగాం జయప్రకాష్ నారాయణ (జయబాబు)... టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు సమక్షంలో గురువారం ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కురుపాంలో జరిగిన ప్రజాగళం కార్యక్రమంలో జయబాబు తన అనుచరులతో కలసి టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో ఆయన అనుచరులు సయ్యద్ ఇబ్రహీమ్ ఉసేన్(సునీల్), వ్యాపారవేత్తలు చెక్క లచ్చయ్య, బుడ్డేపు రామకృష్ణ, కె.ప్రసాద్, వైశ్యరాజు శ్రీనివాస రాజు, పి.రాంబాబు, కలమల కుమార్, జాగాన భాస్కరరావు, నాగేంద్ర, కోఆప్షన్ మెంబర్ క్రాంతికుమార్ తదితరులు ఉన్నారు.



చంద్రబాబు సమక్షంలో తన అనుచరులతో చేరిన జయబాబు



చీపురుపల్లి రోడ్డులో ఓ షాపింగ్ కాంప్లెక్స్ పైకెక్కి చంద్రబాబు ప్రసంగాన్ని వింటున్న యువత

చీపురుపల్లిలో ఇలా..

గరివిడి, మే 9: చీపురుపల్లిలో చంద్రబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో మూసి ఉన్న ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు తెరిపిస్తామని హామీ ఇచ్చారు.

- చీపురుపల్లి నియోజకవర్గంలో పాడైన తారు రోడ్లన్నిటికీ మరమ్మతులు చేయిస్తామన్నారు.
- చీపురుపల్లి నియోజకవర్గం గంజాయికి అడ్డాగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.
- టీడీపీ జిల్లా ఇంచార్జ్ కిమిడి నాగార్జున రాజకీయ భవిష్యత్తుకు తనది హామీ అని భరోసా ఇచ్చారు.
- చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని వినడానికి మహిళలు, యువత పెద్ద ఎత్తున షాపింగ్ కాంప్లెక్స్‌ల పైకి ఎక్కారు.



కురుపాం: చంద్రబాబుతో అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి సత్యనారాయణ



చీపురుపల్లి: నృత్యం చేస్తున్న టీడీపీ అభిమానులు



చీపురుపల్లి మెయిన్ రోడ్డులో జన సందోహం

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజలకు నష్టం: అదితి



కాళిఘాట్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల కిందట తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల ప్రజలకు ప్రయోజనం లేదని, దీని వల్ల నష్టం జరుగుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె గురువారం 42వ డివిజన్ పరిధిలోని కాళీఘాట్ కాలనీ, ఉడా కాలనీ, దండుమారమ్మ ఆలయం తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల ప్రజలు, రైతుల స్థల, భూ వివరాలు ప్రభుత్వం వద్ద నిక్షిప్తమై ఉంటాయని, సంబంధిత ల్యాండ్ కాగితాలు కూడా అక్కడే ఉంటాయన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు రెండో సంతకం ల్యాండ్ టైటిల్ యాక్టుపైనే పెడతారన్నారు. అర్హులైన పేదలకు నగర ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చంద్రబాబు ఇస్తారన్నారు. తొలి నుంచి కూడా నిరుపేద, పేద, మధ్యతరగతి వారికి సొంతింటి కల నేరవేర్చడమే లక్ష్యంగా టీడీపీ కృషి చేస్తున్నదని, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ హామీలను చంద్రబాబు అమలు చేస్తారన్నారు. చంద్రబాబుతోటే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనని, ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడికి రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి, కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చేది చంద్రబాబే: బేబీనాయన

బొబ్బిలి: రానున్నది ఎన్‌డీఏ ప్రభుత్వమేనని, రాష్ట్రంలో అధికారం చేపట్టేది చంద్రబాబేనని బొబ్బిలి తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన) అన్నారు. గురువారం సాయంత్రం సిటింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి శంబంగి స్వగ్రామమైన పక్కిలో ప్రచారం నిర్వహించిన బేబీనాయనకు ఘనస్వాగతం లభించింది. బేబీనాయనతో పాటు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు గిరడ అప్పలస్వామి, మరిశర్ల రామారావునాయుడు, బంకురు బాబూరావులకు గ్రామస్థులు, పార్టీ శ్రేణులు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు. యువత కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ విజన్ కలిగిన చంద్రబాబు పాలనలో రైతులకు, మహిళలకు, యువతకు, చేతివృత్తుల వారికి అంతా మేలే జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న బేబీనాయన

వైసీపీ పాలకులకు బుద్ధి చెప్పాలి: నాగమాధవి



నెల్లిమర్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న లోకం నాగమాధవి

నెల్లిమర్ల: వైసీపీ పాలకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. ఆమె గురువారం నెల్లిమర్ల నగర పంచాయితీతో పాటు మండలంలోని సారిపల్లి, కుదిపి, నీలంరాజుపేట, జగ్గరాజుపేట, రామతీర్థం, డి.నెలివాడ, తంగుడుబిల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో అరాచకాలు, అకృత్యాలు పెరిగిపోయాయని అన్నారు. రాష్ట్రం ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తం అయ్యిందని, మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. గ్రామాల్లో కనీసం మౌలిక సదుపాయాలు కూడా లేవని ఆరోపించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. పరిశ్రమలు స్థాపించి సుమారు 30 వేలమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు అన్నీ నెరవేరుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, నెల్లిమర్ల నగర పంచాయతీ నాయకుడు లెంక అప్పలనాయుడు, లెంక హైమావతి, గేదెల రాజారావు, వానపల్లి వీరభద్రరావు, అట్టాడ శ్రీధర్, రెడ్డి వేణు, రవ్వా నాగేంద్ర వర్మ (నాని), బంగారు సరోజిని, నక్కాన వెంకటరావు పాల్గొన్నారు.

జిల్లా సమస్యలు పార్లమెంటులో వినిపిస్తా: కలిశెట్టి



నెల్లిమర్లలో ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు

నెల్లిమర్ల: తనకు ఈ సారి ఓటేసి ఎంపీగా గెలిపిస్తే జిల్లా సమస్యలను పార్లమెంటులో వినిపిస్తానని కూటమి విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. నెల్లిమర్లలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కూటమి పాలనతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. చంద్రబాబు రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు వరం వంటివని అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయ్యిందని ఆయన విమర్శించారు. వైసీపీ పాలకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ హామీలను చంద్రబాబు అమలు చేస్తారన్నారు. చంద్రబాబుతోటే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, నగర పంచాయతీ నాయకులు లెంక అప్పలనాయుడు, లెంక హైమావతి, వానపల్లి వీరభద్రరావు, అట్టాడ శ్రీధర్, రెడ్డి వేణు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే స్వర్ణయుగం: కోళ్ల

వేపాడ: రాష్ట్రానికి మరో ఐదు రోజుల్లో రాతి యుగం పోయి స్వర్ణ యుగం ప్రారంభమవుతుందని శృంగవరపుకోట ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని కుమ్మపల్లి, కేఆర్‌పేట, వావిలపాడు, నల్లబిల్లి గ్రామాల్లో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వావిలపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. నందమూరి బాలకృష్ణ కుమార్తె శ్రీభరత్ భార్య తేజస్విని, గ్రామ నాయకులు గుంటపల్లి దేముడుబాబు, గోగాడ జగన్నాథం నాయుడు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ● **కొత్తవలస:** మరోసారి వైసీపీ ప్రభుత్వం వస్తే ప్రజలందరూ పక్క రాష్ట్రాలకు వలస పోవలసిందే నని శృంగవరపుకోట నియోజక వర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన ఉమ్మడి అభ్యర్థి కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం ఆమె మండలంలోని వియ్యంపేట, తుమ్మికాపల్లి, ముసిరాం, దేవాడ, సీతంపేట, ఒడ్డిపేట గ్రామాలలో ప్రచారాన్ని నిర్వహించారు.

● **జామి:** కూటమి అభ్యర్థులకు వేసే ఓటుతోనే బంగారుభవిష్యత్తు అని కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం మండలంలోని చింతాడ, రామభద్రపుర అగ్రహారం, పావాడ, కిర్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ● **లక్కవరపుకోట:** శృంగవరపుకోట నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో వార్ వన్‌సైడేనని టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి అన్నారు. ఊళ్లకు ఊళ్లు వైసీపీ నుంచి టీడీపీ వైపు వస్తున్నాయని తెలిపారు. గురువారం సీతాగొర్లెవానిపాలెం గ్రామం నుంచి వందమంది, ఎస్.కోట, వేపాడ మండలాల నుంచి వందలాది మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో రాంప్రసాద్, టీడీపీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: వావిలపాడులో ప్రచారంలో మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి

చీపురుపల్లిలో ఎగిరేది టీడీపీ జెండానే: కళా



మాట్లాడుతున్న కిమిడి కళావెంకటరావు

గుర్ల: చీపురుపల్లిలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండలంలోని చింతలపేట, గుజ్జింగివలస గ్రామాల్లో ఆయన గురువారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో దోపిడీ పెరిగిపోయిందన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలేక వారి వద్ద నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తూ ఇబ్బందులపాలు చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రైతులకు అన్ని విధాలా మేలు చేకూరుతుందని హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ హామీలను చంద్రబాబు అమలు చేస్తారన్నారు. చంద్రబాబుతోటే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కేఏనాయుడు, పార్టీ మండల నాయకులు సన్యాసినాయుడు, కిరణ్‌కుమార్, జి.రామనాయుడు, పిల్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు, వైసీపీ రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి డా.సుంకరి రమణమూర్తి గురువారం టీడీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చీపురుపల్లి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రమణమూర్తికి పార్టీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి: కోండ్రు



పార్టీలో చేరిన వారితో కోండ్రు మురళి

వంగర: రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యమని రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. వంగరలో శుక్రవారం ఎన్నికల ప్రచార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో కోండ్రుకు టీడీపీ యువత మోటారు సైకిల్ ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో కోండ్రు మాట్లాడుతూ ప్రజాసమస్యలు తీరాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిందేనన్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలనతో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని, అభివృద్ధి కుంటుపడిందని, మళ్లీ పాలన గాడిలో పడాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబు వస్తేనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తమకు అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు.

రాజాం: శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో మండలం కంచరాం గ్రామానికి చెందిన వైసీపీ కుటుంబాలు గురువారం 15 టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు నారా చంద్రబాబునాయుడు పాలనకు శ్రీకారం చుట్టనున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని సాగనంపితేనే రాష్ట్ర ప్రగతి అని అన్నారు. టీడీపీ విజయంతోనే రాష్ట్రానికి స్వర్ణయుగమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి పార్టీ ఘన విజయం సాధించబోతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్‌పై విస్తృత ప్రచారం

రామభద్రపురం: రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని రొంపల్లి ఎంపీటీసీ భవిరెడ్డి శంకరరావు తెలిపారు. గురువారం ఆయన ఇంటింటికీ వెళ్లి టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థి బేబీనాయన, ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ● **రాజాం:** రాజాం ఉమ్మడి టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోండ్రు సతీమణి శ్రీలక్ష్మి కోరారు. గురువారం పురపాలక సంఘం పరిధిలోని 4, 9, 16, 17 వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తూ సైకిల్ గుర్తుకు ఓటువేయాలని కోరారు. ● **విజయనగరం రూరల్:** అదితి గజపతిరాజు, కలిశెట్టి అప్పలనాయుడుకు మద్దతుగా అశోక్ గజపతిరాజు చిన్న కుమార్తె డాక్టర్ విద్యావతి దేవి గురువారం 28 వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలతో మమేకం అయ్యారు.

బేబీనాయన కోసం తెంటు ప్రచారం

బాడంగి: బొబ్బిలి కూటమి అభ్యర్థి బేబీనాయన గెలుపుకోసం మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు మండలంలోని డి.వెంకంపేట, ఆనవరం, మల్లంపేట, రావివలస, గూడెపువలస, అల్లువానివలస, గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా లక్ష్మంనాయుడు మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గంలో బాడంగిమండలంలో టీడీపీకి అత్యధిక మెజార్టీ రావాలని ఆయా గ్రామాల్లో ప్రచారం చేశారు. చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రజలు టీడీపీకి జేజేలు కొడుతూ లక్ష్మంనాయుడుకు హారతులు పట్టారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలు కుటుంబాలు

డెంకాడ: గొడ్డుపాలెం గ్రామం నుంచి మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో సుమారు 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను ఈనెల 13వ తేదీతో ముగింపు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, మాజీ జడ్పీటీసీ కంది సూర్యనారాయణ, యాదవ సాధికార సమితి కన్వీనర్ కొర్నాన ఆదిబాబు, గొడ్డుపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు కలిశెట్టి గోపి తదితర నాయకులు పాల్గొన్నారు. ● **రాజాం రూరల్:** సంతకవిటి మండలం గ్రామస్తులకు హామీ ఇచ్చారు. రాజాం నియోజకవర్గ తెదేపా, జనసేన, భాజపా కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌కు మద్దతుగా కృష్ణంవలసలో సంతకవిటి మాజీ ఎం.పి.పి, తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కొల్ల అప్పలనాయుడు గురువారం ఇంటింట ప్రచారం చేశారు. కోండ్రు మురళీ సారథ్యంలో కృష్ణంవలస గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి తెదేపాలో చేరిన 250 కుటుంబాలకు చెందిన పెద్దలకు కొల్ల అప్పలనాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

4 గడ్డి కుప్పలు దగ్ధం

బాడంగి: వరిగడ్డి కుప్పలు అగ్నికి ఆహుతైన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. 4 గడ్డి కుప్పల విలువ సుమారు రూ.50 వేలు వరకు ఉంటుందని రైతులు గొట్టాపు శ్రీనివాసరావు, భాస్కరరావు, తిరుపతిరావు తెలిపారు. అగ్నిమాపక కేంద్రం వచ్చినప్పటికీ అప్పటికే జరగ వలసిన నష్టం జరిగిపోయిందని వాపోయారు.

సూపర్‌సిక్స్ పథకాలతో పేదల్లో వెలుగు

దత్తిరాజేరు: సూపర్‌సిక్స్ పథకాలతో పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కోరపు కొత్తవలస, విక్రమ్పాపురం, పెదకాద, దత్తి గ్రామాల్లో గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల ప్రకటనతో వైసీపీలో వణుకు పుట్టిందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ పెద్దింటి మోహన్, బోడసింగు సత్తిబాబు, గుషిడి జగన్నాథం, మరడ రాము, తలారి రామసత్యం, సలాది గోపి తదితరులు పాల్గొన్నారు.



కోరపుకొత్తవలసలో శ్రీనివాస్ ప్రచారం

వైసీపీని వీడి టీడీపీలోకి చేరికలు

తెర్లాం: మండలంలో అరసబలగ గ్రామంలో వైసీపీని వీడి టీడీపీలోకి 15 కుటుంబాలు సర్పంచ్ కోరగంజి సాయిరాం ఆధ్వర్యంలో గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోరగంజి సాయిరాం మాట్లాడుతూ దళిత టీడీపీ కార్యకర్తలను ధన ప్రలోభాలకు గురి చేసి, వాళ్లను బెదిరింపులకు పాల్పడి బలవంతంగా వైసీపీ వాళ్లు కండువాలు వేశారని, ఇకనైన వైసీపీ పెద్దలు ఇటువంటి పనులు మానుకోవాలన్నారు. పార్టీలో చేరిన వారిలో కొందరు మాజీ సర్పంచ్ గుళిపల్లి సత్యనారయణ, లింగుపల్లి వెంకటరావు,నల్లాన ఆదినారయన,అవాల రామకృష్ణ, యలమంచి రాములు,పడాల లక్ష్మం,అవాల లక్ష్మీనారయణ, పార్టీలో చేరారు.

కూటమి మేనిఫెస్టోతో అన్నివర్గాలకూ మేలు

మెంటాడ: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టో రాష్ట్రంలోని అన్నివర్గాలకూ మేలు చేకూరుస్తుందని సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని రాబంధ, మీసాలపేట, చల్లపేట, ఆంధ్ర, లోతుగెడ్డ, జయతి, ఇప్పలవలస, పిట్టాడ, మెంటాడ గ్రామాల్లో ఆమె గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ విజ్ఞతతో ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. రాజన్నదొర ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతిఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటువేసి, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె కోరారు.

ఈవిఎంల నిర్వహణపై అవగాహన

రేగిడి: మండలంలో గుళ్లపాడు, కోడిశ పంచాయతీల్లో గురువారం ఓటర్లకు ఆయా గ్రామాల టీడీపీ క్యాడర్ ఈవీఎంల నిర్వహణ, ఓటువేసే విధానంపై చైతన్యం కల్గించారు. అభ్యర్థికి రెండు ఓట్లు వేయాలని, ఈఓట్లు టీడీపీకి వేసి మద్దతు పలకాలని కోడిశ సర్పంచ్ గురవాన రమేష్, టీడీపీనేతలు మంజూటి పురుషోత్తమరావు(బుజ్జి), గురవాన ధనంజయ్ తదితర్లు ఇంటింటికి వెళ్లి ఈవిఎం ఆపరేటింగ్‌పై అవగాహన కల్గించారు.

పిడుగు పాటుకు మహిళ మృతి

వంగర: మండలం బంగారువలసకు చెందిన బొరోతు సత్తెమ్మపై శుక్రవారం రాత్రి పిడుగుపడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామ సమీపానగల పశువుల శాలకు వెళ్లిన ఆమె వర్షం వస్తుందని గమనించి ఇంటికి చేరుకుటానికి వెళ్లే ప్రయత్నంలో ఒక్కసారిగా పెద్దశబ్దంతో పిడుగు పడటంతో మృతిచెందింది. మృతురాలికి భర్త గంగరాజు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



సత్తెమ్మ (ఫైల్)

'మా స్థలం అప్పగించండి'

విజయనగరం రూరల్: నగరంలోని ఓ స్థలం ఉమ్మడిగా తామంతా వైసీపీ నాయకులు కోలగట్ల వీరభద్రస్వామి, పరీక్షిత్ రాజు వద్ద కొనుగోలు చేశామని, రిజిస్ట్రేషన్ అయినా, తమ స్థలం అప్పగించడం లేదని బాధితులు చెల్లూరి కల్యాణ చక్రవర్తి, కిలపర్తి సురేష్‌బాబు తదితరులు అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ కాళ్ల గౌరీశంకర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కోలగట్ల వీరభద్రస్వామే తమకు రిజిస్ట్రేషన్ చేశారని, రిజిస్ట్రేషన్ చేసి, ఆ భూమిని మాకు అప్పగించకుండా తిరిగి కోలగట్ల అనుచరుడు దూబేకి లీజుకు ఇవ్వడం, ఇప్పుడు అక్కడ వైసీపీ కార్యాలయం కడుతుండడం విడ్డూరంగా ఉంద న్నారు. తాము ఎన్నిసార్లు ఎమ్మెల్యేను కలిసినా స్పందించడం లేదన్నారు. కాళ్ల గౌరీశంకర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం తక్షణమే వారికి సంబంధిత స్థలాన్ని అప్పగించాలని కోరారు.

బొబ్బిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మురళీకుమార్

బొబ్బిలి: బొబ్బిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది పి.మోహనమురళీకుమార్ ఎన్నికయ్యారు. గురువారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల కార్యాలయంలో పి.జగన్నాథం ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఉపాధ్యక్షునిగా మంతిన సింహాచలం, ప్రధాన కార్యదర్శిగా కొల్లి సింహాచలం తదితరులు ఎన్నికయ్యారు.

రహదారుల పరిశీలన

బొబ్బిలి: ఈ నెల 19 నుంచి మూడు రోజుల బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి శ్రీదాడితల్లి, పాతబొబ్బిలి శ్రీ సరేపోలమ్మ సిరిమానోత్సవాలు జరగనున్న నేపథ్యంలో 20న సిరిమాను రథాలు తిరిగే రహదారుల పరిస్థితిపై మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి గురువారం పరిశీలించారు.